ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 25 ఫిబ్రవరి 2025

శాంతిభద్రతల పరిరక్షణలో ఏఆర్ విభాగం కీలకం: ఎస్పీ



బెలగాం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో ఏఆర్ విభాగం కీలకమని ఎస్పీ ఎస్‌వీ మాధవ రెడ్డి అన్నారు. సోమవారం ఏఆర్ పోలీసుల శిక్షణ కార్యక్ర మానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆయుధాల వినియోగం, ఒత్తిడి అధిగమించడం, సర్వీస్ రూల్స్, నైపుణ్యాల మెరుగు తదితర అంశాలపై ఇస్తున్న ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఏఎస్పీ అంకిత సురానా, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో కమిషనర్

- వైద్యురాలి నుంచి రూ.20 వేల లంచం డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన కమిషనర్ కారు డ్రైవర్
- ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించిన అధికారులు
- నేడు కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ వెల్లడి



పాలకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావు, కారు డ్రైవర్ రమణ్‌రాజులు సోమవారం ఏసీబీ వలకు చిక్కారు. రూ.20 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డారు. మొత్తంగా ఏసీబీ దాడి స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. పాలకొండకు చెందిన ఓ మహిళ 2017లో ప్రసవం కోసమని నగర పంచాయతీలో కోటదుర్గ ఆసుపత్రిలో చేరింది. డెలివరీ అయిన తర్వాత ఆమె బిడ్డ పేరిట జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రంలో తప్పులు దొర్లాయని అనురాధ అనే ఉపాధ్యాయురాలు కోటదుర్గ ఆసుపత్రితో పాటు నగర పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 2023లో విచారణ చేసిన అప్పటి కమిషనర్ సర్వేశ్వరరావు వైద్యాధికారిణి భారతికి రూ.500 ఫైన్ వేశారు. నగర పంచాయతీ కమిషనర్ ఇచ్చిన సమాచారం సంతృప్తిగా లేదని టీచర్ సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్టీఐ కమిషనర్ తమకు పూర్తిస్థాయిలో సమాచారం అందించాలని నగర పంచాయతీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగానే పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు మరోసారి వైద్యురాలి భారతిని సంప్రదించి భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా చూస్తానని , అందుకు రూ.30 వేలు ఇవ్వాల్సి ఉంటుందని డిమాండ్ చేశారు. అయితే డాక్టర్ భారతి రూ.20 వేలు ఇస్తానని ఒప్పుకుని.. అనంతరం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు సోమవారం పాలకొండలోని కోటదుర్గ ఆసుపత్రిలో నగర పంచాయతీ కమిషనర్ కారు డ్రైవర్ రమణరాజ్ వైద్యాధికారిణి భారతి నుంచి రూ.20 వేలు తీసుకుంటుం డగా రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు దొరికి పోయాడు. వారు విచారించగా.. ఈ మొత్తం కమిషనర్‌కు ఇస్తున్నట్టు డ్రైవర్ ఒప్పుకున్నాడు. దీంతో ఏబీసీ అధికారులు నేరుగా కమిషనర్ సర్వేశ్వరరావు ఇంటికి చేరుకుని విచారించారు. అక్కడ నుంచి వారిద్దరినీ నగర పంచాయతీ కార్యాలయం వద్దకు తీసుకొచ్చి వేర్వేరుగా స్టేట్‌మెంట్లు రికార్డు చేసినట్టు ఉమ్మడి జిల్లా ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపారు. కేసు నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మంగళవారం విశాఖపట్నం ఏసీబీ కోర్టుకు వారిని తరలించనున్నట్టు తెలిపారు. ఏసీబీ సీఐలు ఎస్‌వీ రమణ, భాస్కరరావు, ఎస్ఐలు సూర్యారావు, రమణలు పాల్గొన్నారు.

పన్నెండేళ్లలో నలుగురు..

పాలకొండ నగర పంచాయతీని అవినీతి మరక వీడడం లేదు. ఇప్పటివరకు 16 మంది కమిషనర్లు పనిచేయగా.. గడిచిన 12ఏళ్లలో నలుగురు కమిషనర్లు ఏసీబీకి చిక్కారు. 2013, మార్చి 20న నగర పంచాయతీగా అప్ గ్రేడ్ అయిన తర్వాత అదే ఏడాది రెండో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.నాగభూషణరావు, 2015లో టి.కనకరాజు, 2021లో నడిపేన రామారావు, తాజాగా సర్వేశ్వరరావు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో ఉమా మహేశ్వరరావు అనే కార్యనిర్వాహణాధికారి ఏసీబీ వలకు చిక్కారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఏసీబీకి చిక్కిన కమిషనర్, కారు డ్రైవర్

పురపాలక సంఘం.. టీడీపీ ఖాతాలోకి?

- పార్వతీపురంలో మారుతున్న రాజకీయ పరిణామాలు
- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధం
- అధికార పార్టీలోకి క్యూ కడుతున్న వైసీపీ కౌన్సిలర్లు


పార్వతీపురం పురపాలక సంఘ కార్యాలయం

పార్వతీపురం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పురపాలక సంఘం రాజకీయ ముఖచిత్రం మారుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి రంగం సిద్ధమవుతోంది. టీడీపీ లోకి వైసీపీ కౌన్సిలర్లు లైన్ కడుతుండడంతో పార్వతీ'పురం' తెలుగుదేశం పార్టీ పరమయ్యే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. త్వరలో పురపాలక సంఘంపై టీడీపీ జెండా ఎగరనుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వాస్తవంగా పార్వతీపురంలో 30 మంది వార్డులకు గాను వైసీపీ 22 స్థానాలను గెలుచుకుంది. టీడీపీ ఐదు, ఇండిపెండెంట్లు రెండు, బీజేపీ ఒక స్థానంలో గెలుపొందాయి. అయితే ఎన్నికలకు ముందు 26వ వార్డుకు చెందిన కౌన్సిలర్ కరుణ, ఆమె భర్త మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయ ప్రకాష్ నారాయణ (జయబాబు) , ఆరో వార్డుకు చెందిన ఇండిపెండెంట్ కౌన్సిలర్ పారినాయుడు టీడీపీ చేరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటగా నలుగురు వైసీపీ కౌన్సిలర్లు, తాజాగా ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో మరో ముగ్గురు కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మొత్తంగా కూటమి సభ్యుల సంఖ్య 15కు చేరింది. పైగా ఎమ్మెల్యేకు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కు ఉంటుంది. దీంతో వైసీపీ ఆధిక్యం కోల్పోయిన నేపథ్యంలో పురపాలక సంఘాన్ని కైవసం చేసుకునేందుకు టీడీపీ యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల అనంతరం పార్వతీపురం పురపాలక సంఘం లో వైసీపీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యంలో రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. సుమారు 20 మంది కౌన్సిలర్లు అవిశ్వాసానికి అవసరం. అయితే చైర్‌పర్సన్ ఎన్నికల్లో 16 మంది కౌన్సిలర్లు ఎటువైపు ఉంటే ఆ పార్టీకి విజయం లభిస్తుంది. ప్రస్తుతం టీడీపీకి మెజార్టీ ఉండడంతో చైర్‌పర్సన్ పీఠం దక్కించుకుంటుందనే అవకాశం ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. అవిశ్వాసంలో గెలిస్తే పీఠం ఎవరిదనేది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవంగా బీసీ మహిళకు చైర్‌పర్సన్ కుర్చీ రిజర్వు కావడంతో ఎమ్మెల్యేతో పాటు పార్టీ అధిష్ఠానం ఎవరి వైపు మొగ్గు చూపిస్తుందో వారికే చైర్‌పర్సన్ పీఠం దక్కే అవకాశం ఉంది. ఎన్నికలకు ముందు పార్టీ విజయం కోసం కష్టపడిన వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

సార్లూ.. మీరేం చేస్తున్నారు?

- సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వరుస ఘటనలు
- తీరు మార్చుకోని కొందరు ఉపాధ్యాయులు
- ఆవేదన చెందుతున్న తల్లిదండ్రులు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాల అది.. అక్కడ చదువుకొన్న ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. డాక్టర్లు, ఇంజనీర్లు, ఇతరాత్ర వృత్తుల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించారు. అయితే అటువంటి పాఠశాల నేడు వివాదాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. సీతంపేటలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. 1970 నుంచి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఈ పాఠశాలకు ఉంది. అటువంటి బడిలో నేడు పిల్లలను చదివించాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇటీవల జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఈ స్కూల్ పేరు చెబితేనే అమ్మో! అనే మాట వినిపిస్తోంది. పాఠశాలలో మొత్తంగా 240 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఇక్కడ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇదే పాఠశాలలో హైస్కూల్ ప్లస్ టూ కూడా నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ చదువుతున్న విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టాల్సిన కొంతమంది ఉపాధ్యాయులు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంతో కొందరు విద్యార్థులు చదువులు పక్కదారి పడుతున్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కాగా పాఠశాలలో ఇటీవల జరిగిన వరుస ఘటనలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. 3నెలల కిందట పాఠశాలలో జరిగిన ఓ విషయం బయటకు రాకుండా హెచ్ఎం, ఉపాధ్యాయులు జాగ్రత్త పడ్డారు. ఇదే పాఠశాలలో ఓ ఉపాధ్యా యుడిపై పోక్సో కేసు కూడా నమోదైంది. దీనిపై పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా పాఠశాల నుంచి వెలుగులోకి రాని ఘటనలు ఇంకెన్ని ఉన్నాయోనన్న సందేహాలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి.

హెచ్ఎం ఏమన్నారంటే..

సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఎంతో క్రమశిక్షణగా ఉంచుతున్నామని, అయినప్పటికీ కొన్ని ఘటనలు జరగడం దురదృష్టకరమని హెచ్ఎం హేమసుందర్ తెలిపారు. మళ్లీ ఇలా జరగకుండా చూస్తామన్నారు.



సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

అనుకోకుండా ఓ పాత్ర

- అలా నాటకంపై అభిమానం పెంచుకుని..
- ఆలిండియా రేడియోలో ఎన్నో కార్యక్రమాలు

6లో

నేటితో ఎమ్మెల్సీ ఎన్నికల

ప్రచారానికి తెర

- వ్యూహాలకు పదును పెడుతున్న అభ్యర్థులు

6లో

వంకాయ కిలో రూ.4

- పడిపోయిన ధరలు
- నష్టపోతున్న రైతులు



6లో


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పక్కాగా పీ-4 సర్వే

- వచ్చేనెల 28లోగా పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

పార్వతీపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 విధానంపై పక్కాగా సర్వే చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మార్చి 8 నుంచి 28వ తేదీ వరకు ఈ ప్రక్రియ నిర్వహించాలన్నారు. జిల్లాలో 2 లక్షల 65 వేల గృహాలు ఉన్నాయని, వ్యవధి తక్కువగా ఉన్నందున ప్రణాళికాబద్ధంగా సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడుతూ.. పీ-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారిత చేకూర్చాల్సి ఉందన్నారు. జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందిని గుర్తించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ప్రమాణాల మేరకు సర్వే చేపట్టాలన్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసు కొచ్చిన వాట్సాప్ (95523 00009) గవ ర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయాల్లో వాట్సాప్ ద్వారా పొందే ప్రభుత్వ సేవలపై బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్తవ, ప్రత్యేక ఉపకలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, పశు సంవర్ధక అధికారి మన్మథరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా

రీ సర్వే చేయాలి: జేసీ


అధికారులకు సూచనలిస్తున్న జేసీ శోభిక

సాలూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తప్పుల్లేకుండా రీసర్వే చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శోభిక ఆదేశించారు. ములక్కాయవలసలో సోమవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రక్రియకు ముందే సంబంధిత రికార్డులను పరి శీలించాలన్నారు. ఆయా భూములపై క్షేత్రస్థాయిలో వీఆర్వో తదితరులతో సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. రీసర్వే చేస్తున్నప్పుడు వారు చెబుతున్నది వాస్తవమా, కాదా అనేది సులభంగా గుర్తించొచ్చన్నారు. నిబంధనలు ప్రకారం ఎటువంటి వివక్ష లేకుండా పనులు చేయాలన్నారు. రీ సర్వేలో తప్పులు దొర్లితే సహించబోమన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులేమైనా ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం పలువురు రైతులు తమ సమస్యలను జేసీకి విన్నవించారు. ఈ వర్క్ షాపులో సాలూరు, మక్కువ, పాచిపెంట తహసీల్దార్లు రమణ, ఇబ్రహీం, రవి, సర్వేయర్లు, ఏడీ సర్వేయర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై

అవగాహన తప్పనిసరి

- జిల్లా రెవెన్యూ అధికారి హేమలత

పార్వతీపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కె.హేమలత సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలన్నారు. నిర్లక్ష్య ధోరణి పనికిరాదన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల మేరకు నడుచుకోవాలని ఆదేశించారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుందని, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. ముందుగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో అందించే పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులు ఇతరత్రా వాటిని క్షుణ్ణంగా పరిశీలించు కోవాలన్నారు. పోలింగ్ నిర్వహణలో సూక్ష్మ పరిశీలకులదే (మైక్రో అబ్జర్వర్లు) కీలకపాత్ర అని స్పష్టం చేశారు. సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై ఎన్నికల్లో వారు నిర్వర్తిం చాల్సిన విధులను వివరించారు. జిల్లాలో ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరిగితే ఆ సమాచారాన్ని సీల్డ్ కవర్లో పెట్టి సాధారణ పరిశీలకులకు అందించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో హేమలత

అనుకోకుండా ఓ పాత్ర



తాండ్ర పాపా రాయుడు వేష ధారణలో..

- అలా నాటకంపై అభిమానం పెంచుకుని..
- ఆలిండియా రేడియోలో ఎన్నో కార్యక్రమాలు

కొమరాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే నాటకం అభిమానం. ఒక పాత్ర అయినా వేయకపోతానా? అని ఆత్రం. నాటకం ఉందంటే కిలోమీటర్ల దూరం నడిచివెళ్లేవారు. అలా ఒకరోజు ఓ నాటకంలో ఓ చిన్నపాత్ర లభించింది. అంతే ఇక వెనుదిరిగి చూసుకోలేదు. స్వయం ప్రతిభ, కృషితో ఎదిగి ఆలిండియా రేడియోలో ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఆయనే రేగులపాడుకు చెందిన కళాకారుడు గొంపాల లక్ష్మంనాయుడు, కళాకారుడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన లక్ష్మంనాయుడు తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. చిన్నతనంలోనే వ్యవసాయ పనులు, పశువులు పనులు చేస్తూ నాటకాలపై కూడా మక్కువ పెంచుకున్నారు. అప్పట్లో గ్రామాల్లో వేసే సాంఘిక నాటకాలు, పద్యాలపై దృష్టి పెట్టారు. లక్ష్మంనాయుడు అప్పటి ఎస్ఎస్ఎల్సీలో ఉత్తీర్ణత సాధించారు. 1981లో విశాఖ ఆకాశవాణి కేంద్రంలో అల్లూరి సీతారామరాజు పాత్ర ఏకపాత్రాభినయం మొదట ప్రసారమైంది. దీంతో ఏఐఆర్‌లో కొమరాడ పేరు మార్మోగింది. అప్పటి నుంచి ఆయన గొంతు రేడియోలో అందరికీ సుపరిచితమయింది. బాలచంద్రులు, తాండ్ర పాపారాయుడు, మాయల పకీరు, దుర్యోధనుడు, యమసభ, హరిశ్చంద్రుడి ఘట్టాలు, బొబ్బిలిపులి తదితర పాత్రలు అందరినీ మెప్పించాయి. గిరిజన జీవన శైలిపై ఆలిండియా రేడియో (ఏఐఆర్)లో బుర్ర కథలు వినిపించారు. గంటేడ గౌరునాయుడు రచించిన అప్పలరాజు పువ్వుల చొక్కాను నాటకంగా ప్రదర్శించారు. 'స్త్రీ అబల కాదు సబల' వంటి కథలు రాసి పుస్తక ప్రియులకు మెప్పించారు. విశాఖపట్నం, విజయవాడ, కడప, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాల ద్వారా వందలాది కార్యక్రమాలు ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఆకాశవాణి ప్రోగ్రాంలకు, నాటకాలకు రోజులు చెల్లిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏడు పదుల వయస్సు దాటినా లక్ష్మంనాయుడు ఇప్పటికీ కొమరాడ, పార్వతీపురంలో ఎలాంటి అధికారిక కార్యక్రమాలు జరిగినా హాజరవుతుంటారు.



విశాఖ ఆకాశవాణి కేంద్రంలో లక్ష్మంనాయుడు

కృషి, పట్టుదలే నా విజయానికి కారణం



పట్టుదల, కృషి వల్లే రేడియోలో ప్రోగ్రామ్‌లు చేసే స్థాయికి వెళ్లాను. స్వగ్రామానికి సమీపంలో ఉన్న గుమడ రైల్వేస్టేషన్‌లో అప్పట్లో నాటక ప్రదర్శనలు జరిగేవి. వాటిని చూసేందుకు రాత్రిపూట మూడున్నర కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లేవాడ్ని. అలా వెళ్లిన సమయంలో అనుకోకుండా ఒక రోజు హరిశ్చంద్ర పాత్రలో నటించే అవకాశం లభించింది.

\- గొంపాల లక్ష్మంనాయుడు, కళాకారుడు, రేగులపాడు

పాఠశాల ఆవరణలో కూరగాయల సాగు



కూరగాయలు చూపిస్తున్న విద్యార్థినులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అది మండలంలోని పిరిడి మండల పరిషత్ పాఠశాల. అక్కడ ఆవరణలోనే కూరగాయలు సాగు చేస్తున్నారు. దాన్ని కిచెన్ గార్డెన్ అని పిలుచుకుంటారు. దీనికి ప్రధానోపాధ్యాయుడు సత్యానారాయణ ప్రోత్సాహం ఇస్తున్నారు. ఇందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు సహకరిస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. వాటినే మధ్యాహ్న భోజనంలో వాడుతున్నారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నారు. పురుగు మందుల వాడకం అధికమైన నేపథ్యంలో పాఠశాల ఆవరణలోనే కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నామని హెచ్‌హెం తెలిపారు.

రాయితీ రుణాల కోసం ఎదురుచూపు



- ఎన్నికల కోడ్‌తో నిలిచిన ప్రక్రియ
- రూ.169.88 కోట్ల నిధులు విడుదల
- జిల్లాలో 5,871 మందికి లబ్ధి

రాజాం రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ రుణాల కోసం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జవసత్వాలు కోల్పోయిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈబీసీ కార్పొరేషన్లకు జీవం పోసి, లబ్ధిదారులకు ఉపాధి కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్దేశించింది. కేటగిరీల వారీగా యూనిట్లు, ఏ మేరకు నిధులు అవసరమో గుర్తించింది. ఇంతలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో రుణాల ప్రక్రియకు కోడ్ అడ్డంకిగా మారింది. దీంతో రుణ ప్రక్రియ నిలిచిపోయింది.


ఉమ్మడి జిల్లాలో..

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలో 2024-25కి సంబంధించి పలు కార్పొరేషన్ల ద్వారా 5871 మందికి స్వయంఉపాధి, జనరిక్ మెడికల్ షాప్‌లు, ఉమ్మడి వ్యాపారాలకు రుణాలిచ్చేందుకు రూ.169.88 కోట్లు అవసరమని ప్రభుత్వం నిర్ణయించి, ఆ మేరకు నిధులు విడుదల చేసింది. వాస్తవానికి జనవరిలోనే జరగాల్సిన దరఖాస్తులు, కేటాయింపుల ప్రక్రియ సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఈ నెల 1 నుంచి 7వ తేదీలోగా దరఖాస్తుల స్వీకరణ, అర్హుల ఎంపిక యూనిట్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయించారు. అయితే ఎన్నికల్ కోడ్ ప్రతిబంధకంగా మారింది. ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో లబ్ధిదారుల ఎంపిక, యూనిట్లు మంజూరు ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న జిల్లాల్లో దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక, యూనిట్లు, రుణ మంజూరు కోసం అవకాశం కల్పించాలని అధికారులు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నికల కమిషన్ అనుమతి రాకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది.

ఏర్పాటు చేయనున్న యూనిట్లు, నిధులు (రూ.కోట్లలో) వివరాలిలా..

విభాగం	లబ్ధిదారులు	నిధులు
మైనారిటీ	86	1.33
స్వయంఉపాధి (బీసీ)	2883	53.48
జనరిక్ మెడికల్ షాపులు(బీసీ)	59	4.72
స్వయంఉపాధి (ఈబీసీ)	96	1.66
జనరిక్ మెడికల్ షాపులు(ఈబీసీ)	17	1.36
స్వయంఉపాధి (ఎస్సీ)	930	31.46







మార్చి మొదటి వారంలో..

ఎన్నికల కోడ్ సడలించాక మార్చి మొదటి వారంలో ప్రభుత్వం నుంచి రివైజ్డ్ షెడ్యూల్ వచ్చే అవకాశాలున్నాయి. ఆ మేరకు కలెక్టర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తాం. షెడ్యూల్‌లో పొందుపరచని యూనిట్లు ఏర్పాటు చేయాలనుకునే లబ్ధిదారులు ఆ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువస్తే, ప్రభుత్వానికి నివేదించి వెసులుబాటు కల్పిస్తాం.

\- పెంటోజీరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్

నేటితో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి తెర

- వ్యూహాలకు పదును పెడుతున్న అభ్యర్థులు



సాలూరు రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 25 సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారపర్వానికి తెరపడనున్నది. దీంతో అభ్యర్థులు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానికి పది మంది పోటీలో ఉన్నారు. వారిలో సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, పీడీఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి మధ్య ప్రధానంగా పోటీ నెలకొని ఉంది. ఇప్పటికే ముగ్గురు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మకు టీడీపీ మద్దతు ప్రకటించింది. అంతేకాక మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు సైతం ప్రచారం నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా వేదిక సైతం ప్రత్యర్థులపై విమర్శ బాణాలను ఎక్కుపెడుతున్నారు.

జిల్లాలో 15 పోలింగ్ స్టేషన్లు

ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పార్వతీపురం మన్యం జిల్లాలో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. మన్యం జిల్లాలో 2,333 మంది ఓటర్లు ఉన్నారు. పార్వతీపురంలో అత్యధికంగా 636 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా పాచిపెంట మండలంలో 34 మంది ఉన్నారు. సాలూరులో 252 మంది, మక్కువలో 55 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ సిబ్బంది ఈ నెల 26 సాయంత్రానికి పోలింగ్‌స్టేషన్లకు చేరుకోనున్నారు.



హాజరైన ప్రజలు



గీతాలపాన చేస్తున్న గాయకులు

వీనులవిందుగా ఆపాత మధురాలు

విజయనగరం ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్ సినీ సంగీత ప్రియులను ఆకట్టుకుంది. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు, శోభన్‌బాబు నటించిన చిత్రాల్లోని మధుర గీతాలను కార్యక్రమంలో వర్ధమాన గాయనీ గాయకులు ఆలపించారు. విజయనగరం మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో కోకిల వెంకట్ సంగీత సారథ్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆహ్లాదకర వాతవరణంలో గీతాలు వింటూ అభిమానులు సందడి చేశారు.

మద్దతు ధర కోసం గిరిజనుల ధర్నా



జీసీసీ బీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు సోమవారం స్థానిక జీసీసీ బీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. గిరిజన సంఘం నాయకులు తిరుపతిరావు, సాంబయ్య, భాస్కరరావు మాట్లాడుతు ప్రభుత్వం చింతపండు కేజీకి రూ.50, కొండచీపుర్లు రెండు రకాలకు చెందినవి రూ.60, 70కి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరతో జీసీసీ కొనుగోలు చేయని పక్షంలో దశ లవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేడు పోలమాంబ ఐదో వారం జాతర



మక్కువ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాంబ ఐదో వారం జాతర మంగళవారం నిర్వహించనున్నారు. ప్రతి వారం అమ్మవారి దర్శనానికి పెరుగుతున్న భక్తుల సంఖ్య మేరకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ చెప్పారు. వంద మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

జన్‌మన్ గృహాల పనులు వేగవంతం చేయండి

- ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ గృహాల పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో సి యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీవో మాట్లాడుతు గృహాల నిర్మాణాలను ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేసి చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా సంబంధిత అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్మాణాల పురోగతికి సంబంధించి లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

వంకాయ కిలో రూ. 4



- పడిపోయిన ధరలు
- నష్టపోతున్న రైతులు

గజపతినగరం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన కాయగూర పంటలకు గిట్టుబాటుధర రాక రైతులు నిరాశ పడుతున్నారు. ఇటీవల కాలంలో టమాటా ధర పతన స్థాయికి పడిపోవడం చూశాం. దీంతో రైతులను ఆదుకునేందుకు మార్కెటింగ్ శాఖ రంగంలోకి దిగి కాస్త ధర పెంచి కొనుగోలు చేస్తోంది. తాజాగా వంకాయ పరిస్థితి కూడా అలాగే మారింది. గిట్టుబాటు ధర రాక గంగచోళ్లపెంట గ్రామంలో ఓ రైతు ఇటీవల వంకాయలను ట్రాక్టర్‌తో ఉచితంగా పంపిణీ చేశాడు. గత డిసెంబరులో 30 కేజీల ధర రూ.1200 పలికింది. రకాన్ని బట్టి రూ.800నుంచి రూ.100వరకు ఉండేది. దీంతో రైతులు ఆశలు పెంచుకుని మరింత విస్తృతంగా సాగు చేపట్టారు. తర్వాత పరిస్థితి తలకిందులైంది. గజపతినగరం మండలంలో పురిటిపెంట, గంగచోళ్లపెంట, మదుపాడ, మరుపల్లి, ఎం.గుమడాం తదితర గ్రామాల్లో పంటను అధికంగా సాగు చేశారు. సుమారు 20 సెంట్లలో సాగు చేసేందుకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు చేశారు. తీరా పంట చేతికి వచ్చాక కిలో రూ.3 నుంచి రూ.4కు విక్రయిస్తున్నారు. 30కేజీల కేటు ధర రూ.60నుంచి రూ.80కి దళారులు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. జనవరి నెల దాటాక పెళ్లిళ్ల సీజన్ వచ్చినా వంకాయల ధర తగ్గిపోవడం రైతును అయోమయానికి గురిచేస్తోంది. కొన్నిచోట్ల దళారులు ఒక్కటై పంటను తక్కువ ధరకు కొంటున్నారని చెబుతున్నారు. వారం రోజులు కిందట గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన రైతు నాగరాజు పండిన పంటను గ్రామంలో ఉచితంగా పంపణీ చేశాడు. సాగుపై పెట్టిన పెట్టుబడి రాలేదని, ఒక కూలీకి రోజుకు రూ250 చెల్లించానని వాపోయాడు.



పురిటిపెంటలో పశువుల మేతకు వదిలేసిన పంట

పశువుల మేతకు వదిలివేశాం

వంకాయ ధర దారుణంగా పడిపోయింది. 30సెంట్ల భూమిలో పంట సాగుచేశాను. మార్కెట్‌లో కిలో వంకాయ రూ.3నుంచి రూ.4కు అడుగుతున్నారు. పెట్టుబడి రాలేదు. పంటను సేకరించాలన్నా కూలీలకు ఖర్చు పెరిగిపోయింది. దీంతో పంటను పశువుల మేతకు వదిలేశాను.

\- బాలి రామునాయుడు, రైతు

ఆక్రమణలు తొలగించేదెప్పుడు?

● కబ్జాదారుల చెరలో తాటిపూడి, ప్రభుత్వ భూములు ● నోటీసులు పట్టించుకోని అక్రమార్కులు

● ప్రభుత్వ రేటుకు కొట్టేయాలని కొందరి యత్నం



ఆక్రమిత స్థలంలో నిర్మించిన భవనం వద్ద మార్కింగ్ చేయిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది (ఫైల్)

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ పరిధిలోని తాటిపూడి ఇరిగేషన్ భూములు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల తొలగింపునకు అడుగులు పడటంలేదు. ఇక్కడి భూములు ఆక్రమణకు గురయ్యాయంటూ గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అదే గ్రామానికి చెందిన యువకులు జేసీ సేతు మాధవన్‌కు ఫిర్యాదు చేశారు. దానిపై తీవ్రంగా స్పందించిన జేసీ అది ప్రభుత్వ స్థలం అయితే ఎవ్వరికి ఎటువంటి నోటీసులు ఇవ్వాల్సిన పనిలేదు.. వెంటనే సర్వే చేసి తొలగించాలని తహసీల్దార్ అరుణకుమారిని ఆదేశించారు. జేసీ ఆదేశాలను అనుసరించి జనవరి 7న రెవెన్యూ సిబ్బంది, జలవనరుల సిబ్బంది ఆయా భూముల్లో సర్వే చేశారు. విజయనగరానికి చెందిన వైద్యుడు నాలుగు సెంట్లు ప్రభుత్వ స్థలం. 68 సెంట్లు ఇరిగేషన్ భూమి ఆక్రమించినట్టు గుర్తించారు. అలాగే ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగి సెంటుకు పైబడి ఇంటి నిర్మాణం చేపట్టడంతో పాటు 12 సెంట్ల ఇరిగేషన్ భూమి ఆక్రమించి తన ఇంటికి ప్రహరీ కట్టేశాడని గుర్తించారు. ఆ తర్వాత వారికి నోటీసులు జారీచేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వైద్యుడు.. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఆ భూమిని కొంటానని ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిసింది. ఇరిగేషన్ భూమిలో ఇల్లు నిర్మించిన ఉద్యోగి మాత్రం రెవెన్యూ శాఖ ఇచ్చిన నోటీసులను బేఖాతర్ చేశారు. ఈవిషయంపై సదరు పంచాయతీ వీఆర్‌వో నాయుడు వివరణ కోరితే సదరు ఉద్యోగి నుంచి సమధానం రాలేదని తెలిపారు. ఆక్రమణదారులకు త్వరలోనే 6-ఏ, 7-ఏ నోటీసులు అందజేస్తామన్నారు.

ఆక్రమణల విషయంపై ఇరిగేషన్ సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ తమ్మినాయుడు వివరణ కోరగా ఆక్రమణల తొలగింపు అంటే చిన్న విషయం కాదన్నారు. దీనికి చాల డబ్బులు కావాలన్నారు. అందుకు తగ్గ ఖర్చులు విషయం అధికారులకు వివరించామన్నారు. వారు నిధులు మంజూరయ్యాక వాటిని తొలగించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అదే సమయంలోనే సదరు ఇరిగేషన్ సహాయక ఇంజనీర్ గతంలో తమ శాఖ స్థలంలో సర్వే ద్వారా గుర్తించిన ఆక్రమణలు పంచాయతీ తొలగించాలనీ వారికి లేఖ రాయడంపై చర్చ జరుగుతోంది.

ఇదే విషయంపై ముషిడిపల్లి యువకులు మాట్లాడుతూ గత ఏడాది తమ గ్రామానికి వచ్చిన జేసీ ప్రభుత్వ భూమి అయితే ఎటువంటి నోటీసులు ఇవ్వాల్సిన పనిలేదని చెప్పారని అధికారులు మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీన్ని మరోసారి జేసీ దృష్టిలో పెడతామని వారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్ర గాయాలు

క్రైంన్యూస్

రామభద్రపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండకెంగువ గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కొండకెంగువ గ్రామానికి చెందిన బెవర లక్ష్మణరావు(40), గురుమూర్తి, కృష్ణలు బైకుపై గ్రామంలోని కల్లం నుంచి ఇంటికి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో బెవర లక్ష్మణరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కోరపుకొత్తవలసలో అగ్ని ప్రమాదం

దత్తిరాజేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరపు కొత్తవలసలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. రూ. లక్షల్లో ఆస్తినష్టం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు పశువులశాలలు, గడ్డి కుప్పలు, ధాన్యం గోదాములకు నిప్పు పెట్టడంతో కాలి బూడిదయ్యాయి. గ్రామంలోని చవక కల్లంలో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మరడ రామారావుకు చెందిన 3 గడ్డి కుప్పలు, ఒక పశువులశాల, ధాన్యం గోదాంలు, మరడ శంకరరావుకు చెందిన 2 గడ్డి కుప్పలు, మరడ ఈశ్వరరావుకు చెందిన 2 గడ్డి కుప్పలు, ఒక పశువులశాల, మరడ సింహాచలంకు చెందిన 30 క్వింటాళ్ల ధాన్యం కాలి బూడిదయ్యాయి. విషయం గ్రహించిన స్థానికులు బాడంగి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అప్పటికే చాలా వరకు అగ్నికి ఆహుతయ్యాయి. రైతులు లబోదిబోమంటున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టిలో పెట్టారు. బాధితులకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు.

పశువుల అపహరణ

దత్తిరాజేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడేంద్రవలసలో ఆదివారం పశువులు అపరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన టమటాడ రాముకు చెందిన ఒక పశువు, సుంకరి గోవిందమ్మకు చెందిన 3 పశువులు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని వారు స్టేషన్ బూర్జవలస పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు 4 పశువుల రూ.1.50 లక్షల విలువ చేస్తాయని రైతులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

రామభద్రపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బూసాయవలస గ్రామం వద్ద సోమవారం సాయంత్రం బస్సు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బూసాయవలస గ్రామానికి చెందిన మడక కృష్ణ గ్రామంలో రోడ్డు దాటుతుండగా.. విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బలం ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఎంఆర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఏడాది జైలు

తెర్లాం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను వేధింపులకు గురిచేసిన వ్యక్తికి ఏడాది కఠిన కారాగారశిక్ష విధిస్తూ విజయనగరం పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. ఈమేరకు బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. తెర్లాం మండలానికి చెందిన బాలికను బొమ్మాళి అనిల్ 2019లో వేధింపులకు గురిచేశాడు. అప్పట్లో బాలిక ఫిర్యాదు మేరకు తెర్లాం పోలీసులు కేసు నమోదు చేశారు. చార్జీషీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన విజయనగరం పోక్సో కోర్టు న్యాయాధికారి నాగమణి తీర్పు వెల్లడించారని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

రాజాం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజాం-పాలకొండ రోడ్డులో డోలపేట సమీపంలో పాలకొండ నుంచి రాజాం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును రాజాం నుంచి పాలకొండ వైపు వెళ్తున్న టిప్పర్ బలంగా ఢీకొంది. సోమవారం జరిగిన ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు ముందుభాగం దెబ్బతింది. దీంతో రెండువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో ఎవ్వరూ గాయపడలేదు.

కార్మికులపై ఉదాసీన వైఖరి తగదు

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులపై యంత్రాంగం ఉదాసీన వైఖరి చూపడం తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పారిశుధ్య కార్మికులు సమ్మె చేయడంతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కమిటీ వేసి జాప్యం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. నెలల గడుస్తున్న హామీలు అమలు చేయడని తీరును నిరసించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కామేశ్, రామకృష్ణ, శ్రీను, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కలప నరికివేత అడ్డగింత

జామి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజినిగిరి లో కాలువ భూములతో పాటు పోరంబోకు భూముల్లోని కలపను కొంతమంది అక్రమంగా నరికివేస్తున్నారు. సోమవారం స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దాంతో వీఆర్‌వో బంగారునాయుడు ఘటన స్థలానికి వెళ్లి కలపను సీజ్ చేసి తహసీల్దార్‌కు నివేదిక అందించారు. చుక్క రామస్వామి ఈ కలపను నరికించినట్టు గుర్తించామని వీఆర్‌వో తెలిపారు. ఈ విషయంపై తాండ్రంగి మానవహక్కుల సంఘ ప్రతినిధి గౌరినాయుడు మాట్లాడుతూ చాలామంది కలప దొంగలు ప్రభుత్వ భూముల్లోని విలువైన కలపను దోచుకుంటున్నారన్నారు. సామిల్లులకు అక్రమంగా కలప తరలుతోందన్నారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేయాలని కోరారు.

శివరాత్రి రోజున మాంసం విక్రయాలు వద్దు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న నగరంలో ఎక్కడా మాంస విక్రయాలు చేపట్టరాదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అతిక్రమించి ఎవరైన మాంస విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

5న శ్రీరామ పాదుక పట్టాభిషేకం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వచ్చేనెల 5వ తేదీన జరిగే శ్రీరామ పాదుక పట్టాభిషేకాన్ని విజయవంతం చేసుకుందామని పట్టణ వికాస తరంగిణి అధ్యక్షుడు ఐ.గుస్నేష్ కోరారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలో వికాస తరంగిణి సభ్యులతో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 5వ తేదీన పట్టణంలోని సౌందర్య నారాయణమూర్తి నగర్‌లో శ్రీరామ పాదుక పట్టాభిషేకాన్ని హిందూ ధర్మ పరిరక్షకుడు తిదండి చిన్న జియ్యర్ స్వామి పర్యవేక్షణలో జరిపిస్తామని చెప్పారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను ఎల్విన్‌పేట సీఐ హరి, ఎస్ఐ శివప్రసాద్ సోమవారం పరిశీలించారు. భద్రగిరి బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని వారు సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు.

భయం లేకుండా పరీక్షలు రాయండి

బలిజిపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాయాలని బలిజిపేట ఎంఈవో సామల సింహాచలం అన్నారు. నారన్నాయుడువలస, గలావల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఎటువంటి భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులంతా సమష్టిగా శ్రమించాలన్నారు. ఎస్ఎస్.వలస హెచ్ఎం శ్రీనివాసరావు, సీఆర్ఎం టి.మధు పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణత సాధించండి

సీతానగరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయకర్త ఎస్.రూపావతి అన్నారు. మండలంలోని జోగింపేటలోని అంబేడ్కర్ గురుకులాన్ని ఆమె సోమవారం సందర్శించారు. భోజనం, వసతి గదులు, పాఠశాల గదులు పరిశీలించారు. పిల్లలపై శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్ మధుబాబుకు సూచించారు.

నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారుల్లో నైపుణ్యాల పెంచేందుకు కార్యకర్తలు దృష్టి సారించాలని జిల్లా సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త రెడ్డి తేజేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణను ఆయన సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.కొండలరావు, హెచ్ఎం ఎస్ఎల్ పాత్రుడు పాల్గొన్నారు.

తరగతులకు హాజరుకండి

గరివిడి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 15 రోజులుగా తరగతులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులను కళాశాల డీన్ ఎం.శ్రీను, అధ్యాపకులు తరగతులకు హాజరు కావాలని కోరారు. సోమవారం విద్యార్థులు నిరసన తెలుపుతున్న టెంట్ వద్దకు వెళ్లి విద్యార్థులతో చర్చలు జరిపారు. సమస్యలు పరిష్కరిస్తూ జీవో విడుదల చేసేంతవరకు తరగతులకు హాజరయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

అభ్యసన లోపాలను సరిచేయడమే లక్ష్యం

రాజాం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అభ్యసన లోపాలను సరిచేయడానికి అంగన్‌వాడీలకు శిక్షణ దోహదపడుతుందని రాష్ట్ర ప్రథమ కో-ఆర్డినేటర్ పి.వెంకట్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ ప్రాజెక్టును ఆవిష్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా కట్

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ ఫీడర్ల మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ త్రినాథరావు ప్రకటనలో పేర్కొన్నారు. విజయలక్ష్మీ నగర్, ఇప్పిలివీధి, కొత్తపేట, గొల్లవీధి, అద్దెపల్లివారి వీధి, గుంటూరు వీధి, కల్కి భగవాన్ ఆలయం ఏరియా, టూటౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

వైసీపీ ఎమ్మెల్యేల తీరు అప్రజాస్వామికం



ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల తీరు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని ఎమ్మెల్యే అదితి గజపతిరా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చట్టసభల్లో బాధ్యతగా ప్రవర్తించాల్సిన మాజీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే జగన్ గవర్నర్ ప్రసంగం ప్రారంభానికి ముందే మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని పోడియం ఎదుట ఆందోళనకు దిగడం తగదన్నారు. సభను బహిష్కరించటం విచారకరమన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం ప్రజల తీర్పును బట్టే ముఖ్యమంత్రి, ప్రతిపక్ష హోదా లభిస్తాయనే విషయాన్ని ఆయన గ్రహించకపోవడం దారుణమన్నారు.

సారా తయారీ, అమ్మకాలపై నిఘా

విజయనగరం క్రైం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విజయనగరం జిల్లాలో సారా తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.వి.వి.ఎన్.బాబ్జీరావు ఆదేశించారు. సోమవారం ఉమ్మడి జిల్లా అధికారులతో నవోదయం 2.0 సందర్భంగా సర్కిల్-1 స్టేషన్ ఆవరణలో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా ముద్దాయిలు, అనుమానితులను బైండోవర్ చెయ్యాలన్నారు. సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏసీ రామచంద్రరావు, ఏఈఎస్‌లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఘనంగా వీరసత్యం తీర్థం



పరుగు పోటీలో దౌడు తీస్తున్న ఎడ్ల బండి

వేపాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాది శివారు ఎం.సింగవరంలో సోమవారం వీరసత్యం తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించుకున్నారు. మధ్యాహ్నం గుడి ప్రాంగణంలో అన్న సమారాధన నిర్వహించారు. బానాది, బల్లంకి, వల్లంపూడి, ఎం.సింగవరం గ్రామాల భక్తులు అన్నప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఎడ్లబండ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి యశోద, గ్రామ పెద్దలు గళ్ల కోటారావు, గళ్ల రాము మాస్టారు, కె. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల జాబితాలో పేర్లు చేర్చండి

వేపాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి-బొడ్డవర మధ్యలో విశాఖ-అరకు రోడ్డు జాతీయ రహదారిగా మార్పుతో నష్టపోతున్న వారి జాబితాలో పేర్లను చేర్చాలని తహశీల్దార్ జె.రాములమ్మకు 20 మంది బాధిత కుటుంబాలు వినతి పత్రం అందజేశాయి. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేలో మా పేర్లు లేవన్నారు. ఇందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. జిల్లా అధికారులకు మీ పేర్లను పంపించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

శివపార్వతుల లింగాలకు కిరణ స్పర్శ



లింగాలను తాకిన సూర్యకిరణాలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంచరాంలోని మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతి లింగాలను సోమవారం సూర్యకిరణాలు స్పర్శించాయి. సోమవారం ఉదయం స్వయంభూగా వెలిసిన శివుడు, పార్వతి లింగాలకు ఆలయ ప్రధాన అర్చకులు అంది సాంబశివరావు అభిషేకం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా సూర్యకిరణాలు తాకడం గమనించారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, సుమారు పది నిమిషాల పాటు లింగాలను కిరణాలు తాకాయని అర్చకుడు తెలిపారు.

రామతీర్థంలో జాతర ఏర్పాట్ల పరిశీలన



దేవస్థానం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

నెల్లిమర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామివారి దేవస్థానంలో ఈ నెల 26న జరుగునున్న శివరాత్రి జాతరకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. జాతరను పురస్కరించుకుని రామతీర్థంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన సోమవారం పరిశీలించారు. వాహనాల రాకపోకలకు దారి మళ్లింపు, వాహనాల పార్కింగ్ స్థలాలు, ఆలయం వద్ద క్యూలైన్‌ల ఏర్పాట్లు తదితర ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, ఎస్‌బీ సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, నెల్లిమర్ల ఎస్ఐ గణేష్, ఈవో వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

జాతరను సమర్థంగా నిర్వహించండి



మాట్లాడుతున్న తహసీల్దారు కృష్ణలత

జామి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పు జామి ఎల్లారమ్మ జాతర మార్చి 6,7, 8 తేదీల్లో సమర్థంగా నిర్వహించాలని తహసీల్దార్ కృష్ణలత అన్నారు. జాతరకు సంబంధించి ఏర్పాట్లపై సోమవారం అధికారులతో తహసీల్దార్ సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి సౌకర్యంపై దృష్టిసారించాలన్నారు. ఏటా ప్రజలకు తాగునీరు, వాడక నీరు కోసం తాటిపూడి రిజార్వాయర్ నుంచి నీరు వదులుతారని, అయితే ఇటీవల నదిలో ఇసుక తవ్వకాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాటిపై సంబంధిత శాఖ దృష్టి సారించాలన్నారు. జాగరం వాటర్ పాల్స్‌కు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. జాతరకు 250 మందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చనమల్లుపేటలో ఆర్డీవో విచారణ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కీర్తి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుషిణి పంచాయతీ చనమల్లుపేటలో ఆర్డీవో దాట్ల కీర్తి సోమవారం పర్యటించారు. మూడు రోజుల క్రితం ఆ గ్రామానికి చెందిన చనమల్లు అబద్ధం నెల్లిమర్లలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి పాఠకులకు విదితమే. కలెక్టర్‌ఆదేశాల మేరకు ఆమె ఆ గ్రామంలో విచారణ చేశారు. బాధిత రైతుతో మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భరోసా ఇచ్చారు. భూమిని సర్వే చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దార్, మండల సర్వేయర్‌ను ఆదేశించారు. ఆమెతో పాటు తహసీల్దార్ సుదర్శనరావు, మండల సర్వేయర్ టి.దివ్య మానస, ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వో శ్రీరామ్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.29 లక్షలు

చీపురుపల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చీపురుపల్లిలోని కనకమహాలక్ష్మి అమ్మవారికి హుండీ ద్వారా రూ.2,29,121లు ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరి 3 నుంచి ఫిబ్ర వరి 24 వరకూ భక్తులు హుండీలో వేసిన కానుకలను సోమవారం లెక్కిం చామన్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తాం గ్రూపు ఆలయాల ఈవో జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారన్నారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

విజయనగరం కలెక్టరేట్ ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి కిసాన్ 19వ విడత నిధులు సోమవారం విడుదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 1.84 లక్షల మంది రైతులకు రూ.37.84 కోట్లు విడుదలయ్యాయి. ఒక్కొక్క రైతు బ్యాంకు ఖాతాలకు రూ.2 వేలు చొప్పున విడుదలయ్యాయి.

ఎమ్మెల్సీగా రఘువర్మను గెలిపించండి



నెల్లిమర్ల: అంబేద్కర్ గురుకులంలో బంగార్రాజు ప్రచారం



గజపతినగరంలో పడాల అరుణ..



చీపురుపల్లిలో రామ్‌మల్లిక్‌నాయుడు...

నెల్లిమర్ల/ పూసపాటిరేగ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మను గెలిపించాలని మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు కోరారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలతో పాటు సతివాడ, రామతీర్థం, బొప్పడాం, ఆదర్శ పాఠశాలల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

●గజపతినగరం: ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని మాజీ మంత్రి, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ కోరారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల అధ్యాపకులను కలిసి మాట్లాడారు. రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మునకాల జగన్, జిల్లా జాయింట్ సెక్రటరీ మామిడి దుర్గాప్రసాద్, రాపాక సాయిసురేష్ ఉన్నారు.

●చీపురుపల్లి: కూటమి పార్టీల మద్దతుతో ఎన్నికల బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన పట్టణంలోని గురుకుల పాఠశాల, కేజీబీవీ, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎన్నికల పరిశీలకులు పుచ్చ ఈశ్వరరావు, పార్టీ నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, ముల్లు రమణ పాల్గొన్నారు.

●వేపాడ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను ఉపాధ్యాయులు ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాం ప్రసాద్ పిలుపు నిచ్చారు. సోమవారం మండలంలోని నీలకంఠరాజపురం, వేపాడల్లోని పాఠశాలల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయనతో పాటు నాయకులు దాసరి లక్ష్మి, కొట్యాడ రమణమూర్తి, పోతల వెంకటరమణ ఉన్నారు.



వేపాడలో కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్..

రైతు సేవా కేంద్రాల్లో అన్నదాతల నిరీక్షణ

● పత్తి విక్రయాల నమోదులో జాప్యం

భామిని, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భామిని రైతు సేవా కేంద్రంలో సోమవారం పత్తి రైతులు నిరీక్షించాల్సి వచ్చింది. రైతు సేవా కేంద్రంలో పత్తి విక్రయించిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. కాగా పత్తి కొనుగోలు నిర్వాహకులు మంగళవారం నుంచి పత్తి కొనుగోలుకు తమ సిబ్బంది రారని ప్రకటించడంతో మరింత ఆందోళనకు గురయ్యారు. తాము విక్రయించిన పత్తి నమోదు కాకపోతే తమ ఖాతాలో డబ్బులు పడవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాలుగు గంటల తర్వాత వేలిముద్ర నమోదు కావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా రైతు సేవా కేంద్రానికి ఆశించిన పత్తి రావడం లేదని, ఈ వారం రోజుల్లో సోమవారమే 35 క్వింటాళ్ల పత్తి వచ్చిందని తెలిపారు. దీనిపై సీసీఐ గుంటూరు పత్తి కొనుగోలు అధికారి అఫ్జూర్ వద్ద ప్రస్తావించగా మే నెల వరకు పత్తి కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆన్‌లైన్‌లో సాంకేతిక లోపం వల్ల వేలిముద్రలు పడడంలో జాప్యమైందని తెలిపారు. సూపర్‌వైజర్ సూర్యనారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ ఎల్.సుకన్య రైతులకు సహకరిస్తున్నారు.

రైతుల వివరాలను నమోదు చేసుకోవాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులు సాగు చేస్తున్న భూమి వివరాలను విధిగా ఈ-పోర్టర్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి ఆర్.విజయభారతి సూచించారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, శివ్వాం, గొట్టివలస ప్రాంతాల్లో ఆమె సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వారికి విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయిస్తారని చెప్పారు. ఈ గుర్తింపు సంఖ్యతో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, విత్తనాలు, ఎరువులతో పాటు పలు రకాల ఉపయోగాలు ఉంటాయన్నారు. మండలం లోని 13 రైతుసేవా కేంద్రాల్లో 7,308 మందికి గాను 6,519 మంది పీఎం కిసాన్‌కు నమోదయ్యారన్నారు. మండలం మొత్తంపై 59 శాతం నమోదు చేసుకున్నారన్నారు. ఈ నెలాంతంలోగా వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన భారీ ప్రమాదం

కొమరాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాయగడ వైపు నుంచి విశాఖపట్నం వైపు బొగ్గుతో వెళ్తున్న గూడ్స్‌కు భారీ ప్రమాదం తప్పింది. సోమవారం మధ్యాహ్నం బొగ్గు వేగన్ నుంచి ఒక్కసారిగా పొగ వచ్చింది. దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది గూడ్స్‌ను గమడ రైల్వే స్టేషన్‌లో నిలిపివేసి, పార్వతీపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక అధికారి జి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక శకటాన్ని తీసుకొచ్చారు. బొగ్గు నుంచి వస్తున్న మంటలను ఆర్పివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పినట్లయిందని రైల్వేశాఖ సిబ్బంది తెలిపారు.

నిర్మాణాలు ప్రారంభించకపోతే రద్దు చేస్తాం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గృహ నిర్మాణాలు ప్రారంభించకుంటే రద్దు చేస్తామని తహసీల్దార్ పి.బాల హెచ్చరించారు. మండలంలోని పెద్దూరు, పెదగుడబ, తదితర గ్రామాల్లో గృహ నిర్మాణాలను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల్లో పట్టా పొంది నిర్మాణ పనులు పూర్తి చేయని వారి మంజూరు పత్రాలను తగు చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహసీల్దార్ తెలిపారు. అలాగే ప్రస్తుతం పీఎంఏవై, అర్బన్ 2.0 పథకంలో గృహాల కోసం 25 పంచాయతీల నుంచి 1,503 మంది లబ్ధిదారులు నమోదు చేసుకున్నారన్నారు. ఈ పరిశీలనలో ఆర్ఐ శ్రీనివాస్ గౌరీప్రసాద్, వీఆర్వో వి.కరుణాకర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పీవోఎల్ఆర్‌ను పూర్తి చేయాలి

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులందరూ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ (పీవోఎల్ఆర్)ను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఆర్.పకీరు ఆదేశించారు. సోమవారం ఆయన వీఆర్వోలందరికీ ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పైలట్ ప్రాజెక్టుగా మండలంలో ఎంపిక చేసిన రాజయ్యపేట గ్రామంలో రీసర్వేను పూర్తి చేశామన్నారు. ఇప్పుడు ఎం.అల్లువాడ, గెడ్డతిరువాడ గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసిందని, మార్చి 1 నుంచి రీసర్వే జరగనున్నదన్నారు. అందుకే రీసర్వేను దృష్టిలో పెట్టుకుని పాత రికార్డులను వీఆర్వో లాగిన్ నుంచి తహసీల్దార్ లాగిన్ వరకు అన్నీ సరిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిని ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

కబ్జాపై చర్యలు తీసుకోండి

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు వెళ్లే దండాశి మెరక అనే గోర్జను కొందరు అక్రమార్కులు కబ్జా చేసేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని అల్లువాడ గ్రామ రైతులు తహసీల్దార్ రెడ్డి పకీరును వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం వారు మండల గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్.. పక్కనే ఉన్న సర్వేయర్ సంతోష్‌తో మాట్లాడి మంగళవారం సర్వే హద్దులను ఇచ్చి రావాలన్నారు. ఇలాంటి కబ్జాలు ఎక్కడ జరిగినా ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని అక్రమార్కులను హెచ్చరించారు.

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

● మున్సిపల్ కార్మికుల ఆందోళన



ముఖ్యమంత్రికి రాసిన పోస్ట్ కార్డులు చూపిస్తున్న మున్సిపల్ కార్మికులు

సాలూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కార్మికులు ముఖ్యమంత్రికి లేఖలు రాసి, ఆ పోస్టు కార్డులు మెయిన్‌రోడ్డులో ఉన్న పోస్ట్ బాక్స్‌లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు శంకర్రావు, రాముడు మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులు థర్డ్ పార్టీ చేతుల్లోకి వెళ్తారని, అప్పుడు జీతాలు పూర్తి స్థాయిలో కాంట్రాక్టర్‌కు ఇవ్వరని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

రహదారులకు మరమ్మతులు

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గల బైపాస్ రహదారి తోపాటు పాత బస్టాండ్ కూడలి నుంచి రాయగడ శివారు వరకు ఉన్న అంతరాష్ట్ర రహదారికి సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ డీఈ అప్పాజీని వివరణ కోరగా.. బైపాస్, అంతరాష్ట్ర రహదారుల తాత్కాలిక మరమ్మతులకు ప్రత్యేక నిధులు నుంచి రూ.8లక్షలు కేటాయించారని చెప్పారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సీతానగరం ఫ్లైఓవర్ శివారు వరకు రహదారుల మరమ్మతుల కోసం రూ.3.50 కోట్లు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. త్వరలోనే ఈ పనులను కూడా ప్రారంభిస్తామని చెప్పారు.

కొల్నార సమితిలో గ్రీవెన్స్

ఒడిశా

రాయగడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కొల్నార సమితి కార్యాలయంలో సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పారుల్ పట్వారి ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ నవీన్ చంద్రనాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 43 మంది అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన అదనపు కలెక్టర్ నవీన్‌చంద్ర.. పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జడ్పీ కార్య నిర్వాహణాధికారి అక్షయ్‌కుమార్ ఖెముండు, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ చంద్రకాంత్ మాఝి, అటవీ శాఖాధికారి అన్నాసాహెబ్ ఓహల్, జిల్లా కేంద్రాసుపత్రి ముఖ్య వైద్యాధికారి లాల్ మోహన్ రౌత్రాయ్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వేగావతి ఒడ్డు కోత

● నదిలో కొట్టుకుపోతున్న పంట భూములు ● ఆందోళనలో రైతులు



అలజంగిలో కోతకు గురైన వేగావతి నది ఒడ్డు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలం అలజంగి గ్రామ శివారున ఉన్న వేగావతి నది ఒడ్డు కోతకు గురవుతోంది. దీంతో నదికి ఆనుకుని ఉన్న భూములు నదిలో కొట్టుకుపోతున్నాయి. వరద వచ్చిన ప్రతిసారి భూములతో పాటు పంట కూడా నదిలో కలిసిపోతోందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదిలో ఇష్టానుసారంగా రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్లే ఈ విధంగా కోతకు గురవుతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

కరకట్టలు నిర్మించాలి

ఇప్పటికే చాలా వరకు కోతకు గురయ్యిందని, ఉన్న గట్టు కాస్త పూర్తిగా కోతకు గురైతే నదిని ఆనుకుని ఉన్న పంట భూములకు నష్ట వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గట్టును పటిష్టం చేయడం గానీ నదికి కరకట్ట నిర్మించడం గానీ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

‘పీఎం సూర్యఘర్’ మిషన్ మోడ్‌లో చేపట్టాలి

● పార్వతీపురం మన్యం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన మిషన్ మోడ్‌లో చేపట్టాలని ఎంపీడీవోలు, విద్యుత్‌శాఖ ఏఈలను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణం, పీఎం ఎస్‌జీవై, ఉపాధి హామీ, ఎంఎస్‌ఎంఈ, వైద్య ఆరోగ్యం, పీజీఆర్ఎస్ తదితర అంశాలపై ఆయన సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ ప్రయోజనాల దృష్ట్యా ఎక్కువ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. 3 కేవీ యూనిట్‌కు రూ.2లక్షలు అమలవుతుందని, దీనిపై గృహ యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. దరఖాస్తు చేసిన వెంటనే రుణ సమస్య లేకుండా బ్యాంకర్లతో మాట్లాడాలని సూచించారు. పీఎం సూర్యఘర్ యోజన్‌లో జిల్లా ముందంజలో ఉండాలని, ప్రతివారం డ్రైవ్ చేపట్టి యుద్ధ ప్రాతిపదికన కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. వచ్చే వారానికి ప్రగతి కనబరచని ఎంపీడీవో, ఏఈలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ● జిల్లాలో పీఎం జన్మన్ పథకం కింద 5441 గృహాలు, పీఎంఏవై కింద నిర్దేశించిన లక్ష్యంతో 4219 గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫారం పాండ్స్, ఫిట్ పాండ్స్, కాంపౌండ్ వాల్స్ పనులను ఈనెల 28లోగా పూర్తి చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వేలో కురుపాం, కొమరాడ మండలాలు శతశాతం పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు పి.ధర్మచంద్రారెడ్డి, ఏపీఈపీడీసీఎల్‌ఎల్ పర్యవేక్షక ఇంజినీర్ కె.చలపతిరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు కె.రామచంద్రరావు పాల్గొన్నారు.

పీసా చట్టం పూర్తి స్థాయిలో అమలు కావాలి

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టం గిరిజన ప్రాంతంలో పూర్తి స్థాయిలో అమలు అయ్యేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా సీఈవో వెంకటరమణ కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పీసా శిక్షణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన.. పీసా ఉపాధ్యక్షులు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ చట్టం ప్రాముఖ్యతను వివరించారు. ఎంపీడీవో సాల్మన్‌రాజు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

● కురుపాం: పీసా చట్టంపై సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జడ్పీ సీఈవో ఆర్.వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీసా చట్టంపై ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసా చట్టంపై సచివాలయ సిబ్బంది సమగ్రంగా తెలుసుకుని గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ ఎం.రమణమ్మ, ఐసీడీఎస్ పీవో కేవీ కె.విజయగౌరి, ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ గొర్లి సుజాత పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణను వినియోగించుకోండి



కురుపాం: శిక్షణలో వేసిన చార్టులను చూపిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎంఈవో కె.ప్రసాద్ అన్నారు. పట్టణంలోని కొత్తవలస కొత్తపోలమ్మ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో పిల్లలకు నేర్పించాలని సూచించారు.

పిల్లల అభివృద్ధికి కృషి చేయాలి

కురుపాం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో అమలు పరిచి, పిల్లల అభివృద్ధికి కృషి చేయాలని కురుపాం ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి కోరారు. గత మూడు రోజులుగా కురుపాంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాల్లో అమలు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీవీ రమణమ్మ పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనలో భాగస్వామ్యం కావాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని టీబీ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి కోరారు. మండల పరిధిలోని సోంపురం, ఇట్లామామిడిపల్లి గ్రామాల్లో సోమవారం వందరోజులు క్యాంపెయిన్‌లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ అవగాహనతో క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ సుకన్య, ఏఎన్‌ఎం జానకి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

బెలగాం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఈవీ నాయుడు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కొంతమంది బాధితులు ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● విజయనగరం కలెక్టరేట్: అగ్రిగోల్డ్ కేసులను వెంటనే పరిష్కరించి తమకు న్యాయం చేయాలని బాధితులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అత్యవసర వైద్యం, విద్య, పెళ్లిళ్లకు లక్షలోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణమే చెల్లింపులు చేయాలని కోరారు.

రఘువర్మను గెలిపించాలని ప్రచారం



కురుపాం రూరల్: ప్రచారం చేస్తున్న వీరేశ్ చంద్రదేవ్

కురుపాం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్ర జ్యోతి): కూటమి బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం నీలకంఠాపురం, ధర్మలక్ష్మీపురం, లంకాజోడు, మొండెంఖల్, ఉదయపురం ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ప్రచారం చేశారు. కూటమి నాయకు లు పాల్గొన్నారు. ● కురుపాం: రఘువర్మకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ సోమవారం కురుపాం ఉన్నత పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ● గుమ్మలక్ష్మీపురం: రఘువర్మను గెలిపించాలని కోరుతూ మండలంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలు, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ సోమవా రం ప్రచారం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

సీతానగరం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెత్త సంపద తయారీ కేంద్రంలో డీపీవో కొండలరావు ఆధ్వర్యంలో జిల్లాలో గల విస్తరణాధికారులకు సోమవారం ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణపై అవగాహన కల్పించారు. అలాగే 1994 పంచాయతీరాజ్ చట్టంలో పంచాయతీలకు కల్పించిన అధికారాల ప్రాప్తికి పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో గ్రామాల్లో చేపట్టేందుకు విస్తరణాధికారులకు, కార్యదర్శులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి నాగభూషణం, జిల్లాలోని విస్తరణాధికారులు, పెదభోగిలి ఇన్‌చార్జి కార్యనిర్వాహణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, జిల్లా శిక్షణ కేంద్రం నుంచి భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాలు రుచికరంగా ఉండాలి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థులకు వండిపెట్టే ఆహార పదార్థాలు రుచికరంగా ఉండాలని గిరిజన సంక్షేమ ఉపసంచాలకుడు అన్నదొర ఆదేశించారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం పరిశీలించారు. విద్యార్థుల భోజనంలో మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో ఉన్న బోరు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో పాఠశాల హెచ్‌ఎం సుకుమార్ తదితరులు ఉన్నారు.

‘ఆదర్శ’లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెర్లాం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెరుమాలి ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ జి.జ్యోతిలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి మార్చి31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జాతర ఏర్పాట్లు పరిశీలన

కొమరాడ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంప సోమేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి నాడు జరిగే జాతర ఏర్పాట్లను పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు సోమవారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు ఆలయ ఈవో.. సీఐకి వివరించారు. ఈ పరిశీలనలో కొమరాడ ఎస్ఐ నీలకంఠం ఉన్నారు.

న్యూస్ బాక్స్

విద్యుత్ కోతతో ఇబ్బందులు

కురుపాం, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ నిలుపదల చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సుమారు పది గంటల సమయం విద్యుత్ నిలుపుదల చేయడంతో ఉన్న ఇన్వర్టర్లు కూడా ఆగిపోయాయి. అలాగే నీరు లేక ఇబ్బందులు పడ్డారు. రాత్రి 8 గంటల వరకు చీకట్లోనే మగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎస్‌డబ్ల్యూపీసీలను సక్రమంగా వినియోగించాలి

మక్కువ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చెత్త శుద్ధి సంపద తయారీ కేంద్రాలను సక్రమంగా వినియోగించాలని ఎంపీడీవో డీవీ స్వరూపారాణి అన్నారు. కాశీపట్నం పంచాయతీ ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తను సేకరించి వాహనాల్లో ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలన్నారు. కార్యదర్శి జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.

రావుపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణకు చర్యలు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రావుపల్లి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మర్రాపు శంకరరావుపై అదే గ్రామానికి చెందిన గుంట్రెడ్డి వెంకటనాయుడు పలు అభియోగాలు చేస్తూ జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావుకు గతంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ కోసం సీతంపేట క్లస్టర్ సహాయ పథక సంచాలకుడు జి.శ్రీహరిని విచారణ అధికారిగా నియమించారని ఎంపీడీవో జి.పైడితల్లి సోమవారం తెలిపారు. పంచాయతీ పరిధిలో విచారణ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేసినట్టు ఎంపీడీవో చెప్పారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పాలకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పాలకొండ బస్సు డిపో నుంచి ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా పలు శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డిపో మేనేజర్ పట్నాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజాం మీదుగా రామతీర్థాలకు 20 బస్సులు, పాలకొండ నుంచి రాజాం మీదుగా సంగాంకు ఒక బస్సు. ఉదయం నాలుగు గంటల నుంచి షటిల్ సర్వీసులుగా నడపుతున్నట్టు వెల్లడించారు. ట్రాఫిక్‌ను చూసుకుని బస్సుల సంఖ్యను పెంచుతామని చెప్పారు.

సమయపాలన పాటించాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. సోమవారం సంతోషపురం సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధి పథకంలో నిర్వహిస్తున్న ఇంకుడు గుంతలను పూర్తి చేయించాలన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు హెచ్చరించారు. ఈ పరిశీలనలో సచివాలయ సిబ్బంది, ఉపాధి క్షేత్ర సహాయకులు ఉన్నారు.